క్లుప్తంగా

అంజిబాబు మృతదేహానికి బాలినేని నివాళులు



అంజిబాబుకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు పోకల అనూరాధ భర్త అంజిబాబు అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. ఆయన భౌతిక కాయానికి స్థానిక ఆఖరి మజిలీ పక్కన ఉన్న సత్రం వద్ద శనివారం ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనూరాధ, ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాలినేని వెంట వైఎస్సార్ సీపీ నాయకుడు గంటా రామానాయుడు, తదితరులు ఉన్నారు.

విజయసాయిరెడ్డిని కలిసిన శివప్రసాద్‌రెడ్డి



విజయసాయిరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, బాపట్ల, పల్నాడు జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ విజయసాయిరెడ్డిని దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి శనివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా రీజినల్ కో ఆర్డినేటర్‌గా నియమితులైనందుకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

వృత్తి నైపుణ్యంతో ఆర్థికాభివృద్ధి

ముండ్లమూరు: మహిళలు వృత్తి నైపుణ్యం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవచ్చని జన శిక్షణ సంస్థాన్ జిల్లా డైరెక్టర్ కే శ్యామ్ సునీల్ అన్నారు. మండలంలోని ఈదర గ్రామంలో హ్యాండ్ ఎంబ్రాయిడరీ, డ్రెస్ మేకింగ్‌పై శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు శనివారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీ మహిళల అభివృద్ధి కోసం వృత్తి నైపుణ్య శిక్షణ ఇస్తారన్నారు. తద్వారా చేతి వృత్తుల ద్వారా జీవన ప్రమాణాలు మెరుగు పరుచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజినల్ కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు, ఏరియా కోఆర్డినేటర్ గోపనబోయిన వెంకట్రావు, ట్రైనర్ సుశీల, సువర్ణరాజ్ పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలి

యర్రగొండపాలెం: మణిపూర్ ఘటనపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని బీసీ సంక్షేమ సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు యాపర్తి వీరయ్య డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఆ సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మణిపూర్‌తో పాటు పశ్చిమ బెంగాల్లోని మాల్దా జిల్లాలో మహిళలపై దారుణమైన ఘటనలు జరుగుతున్నాయని, దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని విచారం వ్యక్తం చేశారు. సమావేశంలో ఆ సంఘ నాయకులు బట్టిపోతుల వెంకటేశ్వర్లు, బంగ్లా సుబ్బయ్య, ఎడవల్లి రామయ్య, మోటుకూరి వెంకటేశ్వర్లు, బత్తుల కాటమరాజు పాల్గొన్నారు.

బైక్ మెకానిక్ కుటుంబానికి ఆర్థిక సాయం

కంభం: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బైక్ మెకానిక్ షేక్ సుభానీ కుటుంబానికి నవ్యాంధ్ర టూవీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.30 వేల ఆర్థిక సాయాన్ని శనివారం కుటుంబ సభ్యులకు అందజేశారు. మండల టూవీలర్ మెకానిక్‌ల అధ్యక్షుడు రసూల్ మాట్లాడుతూ అసోసియేషన్ ఫౌండర్ ఎస్‌కే సుభానీ ఆదేశాల మేరకు అందరి సహకారంతో ఈ సాయం చేసినట్లు చెప్పారు. అసోసియేషన్ స్థాపించినప్పటి నుంచి ఎవరికి ఎలాంటి సమస్య వచ్చినా వారికి అండగా ఉంటున్నట్లు తెలిపారు. అసోసియేషన్ సభ్యులు రసూల్, చాంద్‌బాషా, కృష్ణారెడ్డి, సిలార్, నాసర్ వలి, హనుమయ్య, బైక్ మెకానిక్‌లు పాల్గొన్నారు.

అటవీ జంతువులను సంరక్షించాలి

గిద్దలూరు రూరల్: అటవీ ప్రాంతంలో నివసించే జంతువులను సంరక్షించుకోవాలని గిద్దలూరు ఫారెస్ట్ రెంజ్ ఆఫీసర్ హెచ్.జీవన్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా మండలంలోని దిగువమెట్ట గ్రామంలో అటవీ శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. అటవీ ప్రాంతంలో నివసించే ప్రతి జంతువులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అంతేగాక అటవీ ప్రాంతంలో సంచరించే పులులను ప్రత్యేక నిఘా ఉంచ న్నారు. అనంతరం అటవీశాఖ అధికారులతో దిగువమెట్ట రేంజి పరిధిలో అవగాహన కార్యక్రమంలో భాగంగా భారీ ర్యాలీ నిర్వహించారు.

గడపగడపకు విజయం కార్యకర్తలదే

- నాగులుప్పలపాడు మండలంలో ముగిసిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం
- ముగింపు సభలో శిరస్సు వంచి నమస్కారం చేసిన ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు
- 24 వేల ఇళ్ల సందర్శన
- ఇంతటి విజయానికి కృషిచేసిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానన్న ఎమ్మెల్యే



బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

నాగులుప్పలపాడు: ఇచ్చిన హామీలు ఎంత మేరకు నెరవేరాయి, చేసిన పనులు అక్కచెల్లెమ్మలకు ఎంత మేరకు ఉపయోగపడ్డాయి, ఇంకా మన ప్రభుత్వం ప్రజలకు చేయాల్సిన మంచి పనులు ఏంటో కనుక్కోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన కార్యక్రమమే గడపగడపకు మన ప్రభుత్వం అని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. మండలంలోని ఉప్పుగుండూరు గ్రామంలో శనివారం 4వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జగనన్న ప్రభుత్వం ద్వారా ప్రతి కుటుంబానికి జరిగిన మేలును స్వయంగా ప్రతి ఇంటికి వెళ్లి తెలుసుకున్నారు. అనంతరం మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం ముగింపు కార్యక్రమ బహిరంగ సభను ఉప్పుగుండూరు బస్టాండ్ కూడలిలోని గరికపాటి రాజారావు ఓపెన్ థియేటర్‌లో ఏర్పాటు చేశారు. బహిరంగ సభలో ఎమ్మెల్యే టీజేఆర్ మాట్లాడుతూ మండలంలో 20 గ్రామ సచివాలయాల పరిధిలో 24 వేల గడపలను ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కలిసి దిగ్విజయంగా సందర్శించి కార్యక్రమాన్ని ముగించామని తెలిపారు. ఇంతటి ఘనవిజయం వైఎస్సార్ సీపీ కార్యకర్తలదేనని అన్నారు. ఇంత మంచిపని చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మనందరం మళ్లీ ఆశీర్వదించి ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. తప్పుడు మాటలు చెప్పుకుంటూ ఒక అసమర్థ నాయకుడు తిరుగుతున్నాడని, నోరు తెరిస్తే ఎక్కడ తన అసమర్థత బయటకు తెలుస్తుందోనని కేవలం కరచాలనాలతో మాత్రమే నడుస్తున్నాడని, అతని మోసపు మాటలు ప్రజలు నమ్మరాదని లోకేష్‌ను ఉద్దేశించి ఎమ్మెల్యే విమర్శించారు. నిజంగా ప్రజలకు మేలు చేయాలని అనుకునే వారైతే జగనన్న ప్రవేశపెట్టిన పథకాల కంటే గొప్పగా ప్రకటించాలేగానీ.. జగనన్న పథకాలకు పేర్లు మార్చే మాటలే చెప్పుటప్పుడు ప్రజలు జగనన్న పాలనను ఎందుకు వదులుకోవాలో ఆ చేతకాని యువ నాయకుడు బహిరంగంగా చెప్పాలన్నారు. సంతనూతలపాడు నియోజకవర్గాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి సహకారంతో పాటు బాలినేని, వైవీ అండదండలతో అభివృద్ధి చేశామని టీజేఆర్ వివరించారు. జగనన్న అవకాశం ఇస్తే మరోమారు నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ముందుగా గంగమ్మ సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఇనగంటి పిచ్చిరెడ్డి, పొగాకు బోర్డు సభ్యుడు మారెడ్డి సుబ్బారెడ్డి, నాగులుప్పలపాడు, మద్దిపాడు, చీమకుర్తి, సంతనూతలపాడు మండలాల వైఎస్సార్ సీపీ కన్వీనర్లు పోలవరపు శ్రీమన్నారాయణ, మండవ అప్పారావు, పమిడి వెంకటేశ్వర్లు, దుంపా చెంచిరెడ్డి, జెడ్పీటీసీలు వేమా శ్రీనివాసరావు, దుంపా రవణమ్మ, ఎంపీపీ బుడంగుంట్ల విజయ, అరుణ కోటిరెడ్డి, కుమ్మూరి సుధాకర్, దుంపా యలమందారెడ్డి, బత్తుల శ్రీను, వెంకట్రావు, సంజీవరావు, ఘట్టనేని అయ్యన్న, మారెళ్ల వెంకట శేషయ్య, మహిళా నాయకురాలు సన్నపురెడ్డి రవణమ్మ, బెజవాడ రాము, స్టేట్ డైరెక్టర్లు పేరాల చెన్నకేశవులు, కొలకలూరి విజయ్‌కుమార్, పెనుబోతు రంగారావు, గ్రామ సర్పంచ్ దేవరకొండ జయమ్మ, వాసు పంతులు, మాదాసు రాంబాబు, మున్నంగి వెంకట్రావు, కొంజేటి సురేష్, మద్దిసాని రాజేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాలినేనిని సత్కరిస్తున్న స్టాండింగ్ కమిటీ సభ్యులు

బాలినేనికి స్టాండింగ్ కమిటీ సన్మానం

ఒంగోలు: నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సభ్యులు శనివారం ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిని ఆయన నివాసంలో కలిసి సత్కరించారు. నూతన స్టాండింగ్ కమిటీకి తాము ఎంపికయ్యేందుకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో స్టాండింగ్ కమిటీ సభ్యులతో పాటు నగర మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

చీమకుర్తి మున్సిపల్ చైర్మన్‌కు భార్య వియోగం

- నివాళులర్పించి చైర్మన్‌ను పరామర్శించిన జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులును పరామర్శిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

చీమకుర్తి: స్థానిక మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు భార్య చల్లా వెంకాయమ్మ (65) వయోభారంతో శనివారం మృతి చెందింది. చీమకుర్తి రామ్‌నగర్‌లోని అంకులు నివాసం వద్ద వెంకాయమ్మ మృతదేహానికి జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పూలమాల వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, వారి కుటుంబాన్ని పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

శాస్త్రీయ ఆలోచనలను దూరం చేస్తున్న కేంద్రం

ఒంగోలు టౌన్: ప్రజలను శాస్త్రీయ ఆలోచనల నుంచి కేంద్ర ప్రభుత్వం దూరం చేస్తోందని జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) జిల్లా అధ్యక్షుడు ఎ.వి.పుల్లారావు అన్నారు. నగరంలోని ఎల్‌బీజీ భవన్‌లో శనివారం జేవీవీ 17వ నగర మహాసభలు జరిగాయి. బి.తిరుపతయ్య అధ్యక్షతన జరిగిన మహాసభలలో పుల్లారావు ప్రసంగించారు. ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్య పుస్తకాల్లో డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించడం, విజ్ఞాన్ ప్రసార్ వంటి సైన్స్ సంస్థలను నిర్వీర్యం చేయడం, పరిశోధనలకు నిధులు కేటాయించకపోవడం వంటి చర్యలు గర్హనీయమన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఏ ప్రకారం ప్రతి పౌరుడు శాస్త్రీయ ఆలోచనలు, మానవ విలువలు కలిగి ఉండాలని, అందుకు పాలకులు కృషి చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీరు ఇందుకు భిన్నంగా ఉందని చెప్పారు. వాస్తు, జ్యోతిష్యం కోర్సులను ప్రవేశపెట్టడాన్ని ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. సమాజంలో పాతుకుపోయిన మూఢవిశ్వాసాలను నియంత్రించేందుకు జేవీవీ కృషి చేస్తోందని ఆ సంస్థ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆగస్టు 12, 13 తేదీల్లో కనగిరిలో నిర్వహించనున్న జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు.

జేవీవీ నూతన కమిటీ ఎన్నిక...

జేవీవీ నగర నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఒంగోలు నగర గౌరవాధ్యక్షునిగా డా.చాపల వంశీకృష్ణ, అధ్యక్షునిగా ఎస్‌వీ రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎన్‌టీ వెంకటేశ్, కోశాధికారిగా ఎస్.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా టీవీఆర్ సుబ్బారావు, సీహెచ్ లక్ష్మీనారాయణ, కె.పద్మశ్రీ, డి.చంద్రశేఖర్, కార్యదర్శులుగా సీతానాగలక్ష్మి, టి.రమణ, వై.వెంకటేశ్వర్లు, డి.జ్యోత్స్న, శ్రీనివాసులును ఎన్నుకున్నారు.

గడపగడపకు మన ప్రభుత్వంను విజయవంతం చేయాలి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్, వైఎస్సార్ సీపీ నాయకులు

చీమకుర్తి: వచ్చే నెల 1వ తేదీ ఒంగోలు కార్పొరేషన్ పేర్నమిట్ట పరిధిలోని 41వ డివిజన్‌లో సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించనున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఒంగోలు కార్పొరేషన్ కమిషనర్ వెంకటేశ్వరరావు సచివాలయ సిబ్బందికి సూచించారు. స్థానిక కౌన్సిలర్ తేళ్ల చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, కత్తినేని విజయ్‌భరత్‌రెడ్డితో కలిసి సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో గడప గడప కార్యక్రమంపై శనివారం కమిషనర్ సమీక్షించారు.

వర్సిటీ ఉపాధ్యాయుల పదవీ విరమణ కాలం పెంపుపై హర్షం

ఒంగోలు: యూనివర్సిటీల పరిధిలో పర్మినెంట్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారి పదవీ విరమణ వయస్సును 62 నుంచి 65 సంవత్సరాలకు పెంచుతూ ఏపీ హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామలరావు ఉత్తర్వులు జారీ చేయడం ఆనందంగా ఉందని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ డి.వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ గంగాధర్, డాక్టర్ సోమశేఖర, డాక్టర్ జ్ఞానేశ్వరరెడ్డి, డాక్టర్ నిర్మలమణి పేర్కొన్నారు. ఈ నిర్ణయం వల్ల యూనివర్సిటీ పరిధిలో అధ్యాపకుల కొరత తీరుతుందని, అదే విధంగా సీనియర్ ప్రొఫెసర్ల సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఇది కేవలం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నుంచి జీతాలు తీసుకునే ఉపాధ్యాయులకు మాత్రమే వర్తిస్తుందని జీవోలో పేర్కొన్నారు.

బీట్ అధికారికి పురస్కారం

మార్కాపురం: అటవీ శాఖ పరిధి గంజివారిపల్లి రేంజ్ రేగుమానిపెంట బీట్ అధికారి నాగం రోశయ్యకు అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా శనివారం తిరుపతిలో అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రతిభా పురస్కారం అందించి సన్మానించారు. రోశయ్య తన పరిధిలోని అటవీ ప్రాంతంలో పులుల జాడ గుర్తిస్తూ, వాటి కదలికలను పరిశీలిస్తూ, పులుల ఆవాసాలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సంరక్షణకు తీసుకుంటున్న చర్యల ఫలితంగా ఆయన్ను ఈ అవార్డుకు ఎంపిక చేశారు.

తనకు ఈ అవార్డు రావడం సంతోషంగా ఉందని రోశయ్య తెలిపారు. డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ విఘ్నేష్ అప్పావ్, రేంజ్ ఆఫీసర్ సుబ్బారావులు రోశయ్యను అభినందించారు.

కంటి ఆపరేషన్ రోగులకు పండ్ల పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

చీమకుర్తి: శంకర నేత్రాలయంలో కంటి ఆపరేషన్ చేయించుకుని వచ్చిన రోగులకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ శనివారం పండ్లు పంపిణీ చేశారు. భోజన వసతి కల్పించారు. ఈ నెల 13వ తేదీ సినీ హీరో బూచేపల్లి కమలాకర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా బూచేపల్లి చారిటబుల్ ట్రస్ట్ తరపున ఉచిత మెగా కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఆ శిబిరంలో 973 మంది కంటి ఆపరేషన్లకు ఎంపికవగా, వారిని బ్యాచ్‌లుగా విభజించి గుంటూరు వద్ద గల పెదకాకాని ఆస్పత్రికి బస్సులో తీసుకెళ్లి బూచేపల్లి ట్రస్ట్ తరపున ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తున్నారు. వారిలో ఒక బ్యాచ్‌కు చెందిన రోగులు ఆపరేషన్లు చేయించుకుని శనివారం చీమకుర్తి రాగా, వారికి బూచేపల్లి వెంకాయమ్మ అన్నదానం చేసి పండ్లు పంపిణీ చేసి పరామర్శించి ఇంటికి పంపించారు.

వందనం మాస్టారు జీవితం ఆదర్శనీయం



వందనం మాస్టారు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కొమ్మూరి కనకారావు, నలమలపు కృష్ణారెడ్డి

నాగులుప్పలపాడు: స్వాతంత్య్ర పోరాటంలో పాల్గొని దేశానికి సేవలందించడంతో పాటు ఈ ప్రాంత ప్రజలకు విద్యా దాత, మార్గదర్శిగా జీవించిన గంగవరపు వందనం మాస్టారు జీవితం ఆదర్శనీయమని మాదిగ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కొమ్మూరి కనకారావు అన్నారు. శనివారం ఉప్పుగుండూరు మార్కెట్ యార్డులో జరిగిన వందనం మాస్టారు ద్వితీయ సంస్మరణ కార్యక్రమం, ఆయన విగ్రహావిష్కరణ సభలో కనకారావు పాల్గొని మాట్లాడారు. తన ఉపాధ్యాయ వృత్తిలో ఎంతో మందికి విద్యనందించడంతో పాటు వారి ఎదుగుదలకు కృషి చేసిన వందనం మాస్టారు స్వాతంత్య్ర పోరాటంలో ఈ ప్రాంతంలో కీలకంగా పనిచేశారన్నారు. అలాగే తన వృత్తిలో 32 ఏళ్లు కొనసాగి 42 ఏళ్ల పాటు పింఛను అందుకున్న వ్యక్తిగా ట్రెజరీ రికార్డుల్లో నమోదవడం చరిత్రలో నిలిచిందన్నారు. 105 ఏళ్ల వయసులో కరోనాతో ఆయన మరణించారని తెలిపారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చాలా తపన పడేవారని తెలిపారు. అనంతరం కరెంట్ ఆఫీసు వద్ద ఏర్పాటు చేసిన వందనం మాస్టారు విగ్రహాన్ని వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలమలపు కృష్ణారెడ్డి, ఎంపీటీసీ తాటి అనూరాధ చేతుల మీదగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో లిడ్‌క్యాప్ స్టేట్ డైరెక్టర్ కంచర్ల సుధాకర్, పార్టీ నాయకులు మద్దిసాని నాగేశ్వరరావు, అనురాదయ్య, ప్రముఖ రచయిత, పటమటి గాలి నాటకం దర్శకుడు పాటిబండ్ల ఆనందరావు, గద్దె శేషయ్య, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గ్యాస్ క్రిమటోరియంను ప్రారంభించాలి



శ్మశానవాటిక వద్ద ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

ఒంగోలు టౌన్: నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ వెనుక ఉన్న శ్మశానవాటికలో ఏర్పాటు చేసిన గ్యాస్ క్రిమటోరియంను వెంటనే ప్రారంభించి వినియోగంలోకి తీసుకురావాలని నగరాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు కోరారు. శనివారం శ్మశానవాటిక వద్ద నగరాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సుమారు రూ.2 కోట్లతో గ్యాస్ క్రిమటోరియం ఏర్పాటు చేసినప్పటికీ వినియోగంలోకి తీసుకురాకుండా అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని విమర్శించారు. గ్యాస్ క్రిమటోరియం నిర్వహణ విషయంలో నగరపాలక సంస్థ మల్లగుల్లాలు పడకుండా వెంటనే వినియోగం తీసుకురావాలని పౌరసంఘాల సమైక్య సంఘ కన్వీనర్ జి.రమేష్ విజ్ఞప్తి చేశారు. అబ్బూరి లక్ష్మీనారాయణ, సూదనగుంట నరసింహారావు, పసుపులేటి నరసింహరావు, అవిశ హరీష్, మోటుపల్లి వెంకటేశ్వర్లు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో 115 మందికి ఉద్యోగాలు

ఒంగోలు: స్థానిక శ్రీహర్షిణి డిగ్రీ కాలేజీలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 115 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని చైర్మన్ గోరంట్ల రవి కుమార్ పేర్కొన్నారు. డిగ్రీ ఫైనలియర్ పూర్తయిన విద్యార్థులు శనివారం బెంగళూరుకు చెందిన టీచ్‌నూక్, అకెడెమార్ కంపెనీలకు 10 మంది చొప్పున ఎంపికయ్యారని చెప్పారు. వీరి వార్షిక వేతనం రూ.6 లక్షలని తెలిపారు. చెన్నైకి చెందిన టెక్ మహీంద్రా కంపెనీకి 32 మంది విద్యార్థులు ఎంపికవగా, వీరి వార్షిక వేతనం రూ.2.50 లక్షలని వెల్లడించారు. చెన్నైకే చెందిన ఆల్‌సెక్ కంపెనీకి 28 మంది ఎంపికవగా వీరి వార్షిక వేతనం రూ.2 లక్షలని, చెన్నైకి చెందిన ఎడ్యుస్టేషన్ కంపెనీకి 35 మంది ఎంపికవగా, వీరి వార్షిక వేతనం రూ.4 లక్షలని వివరించారు.

వీరంతా ఆగస్టు రెండో వారంలో విధుల్లో చేరాల్సి ఉంటుందన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను చైర్మన్‌తో పాటు సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గోరంట్ల కవిత, ప్రిన్సిపాల్ ఆంజనేయులు, పీజీ కో ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి, ఏవో శ్రీనివాసరావు, గిరీష్, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

అన్ని వర్గాల సంక్షేమమే జగనన్న లక్ష్యం



మంత్రి సురేష్‌కు హారతి ఇచ్చి దీవెనలు అందిస్తున్న వృద్ధురాలు

పెద్దదోర్నాల: అన్ని వర్గాల సంక్షేమమే జగనన్న లక్ష్యమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. మండల పరిధిలోని కటకానిపల్లిలో శనివారం నూరో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఆదిమూలపు సురేష్ ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాలనపై ప్రజల స్పందన, వారికి అందుతున్న సంక్షేమ పథకాలు, స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజాప్రతినిధులు నేరుగా ప్రజల వద్దకు వెళ్లి వివరించడం, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు వారధిగా ఈ కార్యక్రమం ఉందన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న ప్రతి పథకాన్ని వలంటీర్ల ద్వారా ప్రజలకు వారి ఇంటి వద్దనే అందించటం హర్షణీయమని కొనియాడారు. పేదరికాన్ని రూపు మాపేందుకు సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ అందజేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల చేయూతతో ప్రతి పేదవాడు ఆర్థికంగా బలోపేతం అయ్యారని చెప్పారు. ప్రభుత్వ పథకాల కరపత్రాలను ప్రతి కుటుంబంలోని పెద్దలకు అందజేసి వారు ప్రభుత్వం నుంచి ఎంత లబ్ధి పొందారో వివరించారు. ప్రతి ఇంటి వారు రెండు మూడు పథకాలు లబ్ధి పొందామని ఈ సందర్భంగా ఆనందం వ్యక్తం చేశారు. మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుంటే పథకాలన్నీ సక్రమంగా అందుతాయని మంత్రి వారికి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పిక్కిలి కోటిలింగం, డీఎల్‌డీఓ సాయికుమార్, ఎంపీడీవో విజయ, ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు అమిరెడ్డి రామిరెడ్డి, మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ మజీద్, దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ దూదేకుల ఖాశింపీరా, ఎంపీపీ గుమ్మా పద్మజా యల్లేష్, జెడ్పీటీసీ సభ్యులు దుమావత్ లతాచంద్రకాంత్ నాయక్, మాజీ సర్పంచ్ సీతయ్య, నలబోతుల వెంకటేశ్వర్లు, పిక్కిలి కాశిరావు, దండా సుబ్బారెడ్డి, రవి, ముసలారెడ్డి, వెలిదండ నాగేశ్వరరావుతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీస్

1. మా క్లయింటు గుంటూరి ప్రభుదాస్ తండ్రి దేవయ్య నివాసము 1-2-9, మామిడిపాలెం, ఒంగోలు టౌను అను వారు మాకిచ్చిన సెంబాంబుపే మేరకు ఈ ప్రకటన ఇవ్వడమైనది. 2. ది. 26-05-2021వ సంవత్సరములో మా క్లయింటు షెడ్యూల్ దాఖలా ఆస్తిని పెద్దిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి వద్ద ఉండి బిల్ కాంట్రాక్టుగా రూ.39,00,000/- లకు కొనుగోలు చేయుటకు అంగీకరించి అదేరోజున స్వాధీన విక్రయ ఖరారు అగ్రిమెంటు చేసుకొని అదేరోజున పెద్దిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి గారికి రూ. 29,00,000/- లు (అక్షరములా ఇరవై తొమ్మిది లక్షల రూపాయలు) రొఖ్ఖం చెల్లించియున్నారు. ఇట్టిందగా మా క్లయింటు మిగిలిన రూ. 10,00,000/- సైతం చెల్లించి షెడ్యూల్ ఆస్తిని రిజిష్టర్ చేయుకొనుటకు రెడీగా వున్ననూ పెద్దిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి ఇదిగో అదిగో అని కాలయాపన చేయుచున్నారు. షెడ్యూల్ ఆస్తిని విక్రయ ఖరారు అగ్రిమెంటు చేసిన విషయం గోప్యంగా వుంచి పెద్దిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి అతని అనుచరులు కలిసి షెడ్యూల్ ఆస్తిని మోసపూరితముగా ఇతరులకు అమ్ముటాపుతున్నట్లు మా క్లయింటుకు తెలియవచ్చినది. షెడ్యూల్ ఆస్తి పెద్దిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మా క్లయింటుకు స్వాధీన విక్రయ ఖరారు చేసియున్నారు. కావున యావన్మందికి తెలియజేయునది ఏమనగా సదరు పెద్దిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి వద్ద నుండి ఎవరైననూ మా క్లయింటు స్వాధీనములో ఉన్న యం.0-46 సెంట్లు షెడ్యూలు భూమిని విక్రయం పొంద ప్రయత్నించిన యెడల అది మా క్లయింటును ఇబ్బందిపరచుటకే, సదరు విక్రయములు చెల్లనేరవని తెలియపర్చడమైనది. **షెడ్యూలు: ఐటమ్ నెం.1:** ప్రకాశం జిల్లా, ఒంగోలు సబ్ రిజిష్ట్రార్ ఇలాకా - ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ మామిడిపాలెం పాత మరియు కొత్త సర్వే నెం. 90, 91/3, 91/1, 91/7, 91/8, 91/1బి, 91/2, 91/3ఎ, 91/3బి రులో ఏకప్రదేశముగా కలుపుకొని యం.3-23 సెంట్లులో యం.1-48 సెంట్లు బైపాస్‌కు పోగా బైపాస్‌కు ఉత్తరము వైపు యం.0.35 సెంట్లు దక్షిణము వైపు యం.1-40 సెంట్లు మొత్తం యం.1-75 సెంట్లు దక్షిణము వైపున గల యం.1-48 సెంట్లులో యం.0-36 సెంట్లు ఖాళీ స్థలమునకు హద్దులు: **తూర్పు:** పెద్దిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి భూమి, **దక్షిణం:** [illegible] వెంకట సుబ్బయ్య తాలూకు స్థలం, **పడమర:** ఇతరుల స్థలము, **ఉత్తరం:** ఎన్‌హెచ్-5. **ఐటమ్ నెం.2:** ప్రకాశం జిల్లా, ఒంగోలు సబ్ రిజిష్ట్రార్ ఇలాకా - ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్‌లో చేరిన మామిడిపాలెం గ్రామ సర్వే నెం. 91/3, 91/3ఎ, 91/4ఎ రులో ఏక ప్రదేశముగా కలుపుకొని యం. 3-23 సెంట్లులో యం. 1-48 సెంట్లు బైపాస్‌కు పోగా బైపాస్‌కు ఉత్తరము వైపున గల యం. 0.35 సెంట్లులో యం. 0-10 సెంట్లు ఖాళీ స్థలమునకు హద్దులు: **తూర్పు:** ఇతరుల తాలూకు భూమి- ఈ దిశ కొలత 82 అ.లు, **దక్షిణం:** ఎన్‌హెచ్-5 - ఈ దిశ కొలత 60.0 అ.లు, **పడమర:** పెద్దిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి గారి భూమి - ఈ దిశ కొలత 72 అ.లు, **ఉత్తరం:** పెద్దిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి గారి భూమి - ఈ దిశ కొలత 60 అ.లు.

యన్. మోహన్‌దాస్, అడ్వకేట్.
త్యాగరాజమందిరము వీధి, సెంట్రల్ కేఫ్ వద్ద, ఒంగోలు. సెల్: 93904 32939

వైభవంగా చెన్నకేశవునికి శాంతి కల్యాణం

మార్కాపురం టౌన్: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి శాంతి కల్యాణం అర్చకులు శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకుల ఆధ్వర్యంలో అభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణం, అర్చన, అష్టోత్తర పూజలు నిర్వహించారు. రాజ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు అర్చకులు చేశారు. అనంతరం ఉదయం 11 గంటలకు ఆలయ మధ్య రంగ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ప్రత్యేక పూల అలకరణలో ఉభయ దేవేరులతో చెన్నకేశవ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించారు. వేదమంత్రాల మధ్య చెన్నకేశవ స్వామివారి కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. చెన్నకేశవుని శాంతి కళ్యాణానికి ఉభయదాతలు కళ్యాణ ఉత్సవంలో పాల్గొన్నారు. స్వామి వారి కళ్యాణాన్ని భక్తుల మధ్య వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఈవో జి.శ్రీనివాసరెడ్డి, చైర్మన్ పి.కెశవరావు, ధర్మకర్తలు, గౌరవాధ్యక్షులు రామడుగు కోటేశ్వరరావు, కోశాధికారి పెరుమాళ్ల కోటేశ్వరరావు, కార్యదర్శి రామడుగు వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయాలి

గిద్దలూరు రూరల్: ఎస్సీ వర్గీకరణ సాధించేందుకు మాదిగలంతా అంతిమ యుద్ధానికి సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ ప్రకాశం జిల్లా ఇన్‌చార్జి చిలక కిరణ్‌మాదిగ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంయూఎఫ్ సభ్యులతో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు గుర్రం బాబూరావు అధ్యక్షతన శనివారం సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. వర్గీకరణ సాధించే బాటలో ఆగస్టు రెండో వారంలో హైదరాబాద్‌లో 30 లక్షలతో తలపెట్టిన మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.